నేటి కందం- నేటికి అందం

ఊరూరా తిరిగి తిరిగి
నేరుగ పౌరులను గలిసి నిజము నరయగన్
శారదను దలచి జరుపుము
తీరుగ ధారుణి గణాంక దివసమును ధృతిన్

(అక్టోబరు 20 : ప్రపంచ గణాంక దినం)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

మూసీపై విపక్షాల
ముసురుతున్న కౌంటర్లు
ప్రజలనుండి వాస్తవాల
ప్రభుత్వం ఎన్ కౌంటర్లు
ప్రక్షాలన మంచో చెడో
ప్రారంభం పూర్తికాలె
ఆందోళన ఎందుకంత
ఆపేందుకు వెనకాలె



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ | ఆదివారం 20-10-2024 | NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 | సంపుటి :31 | సంచిక:68 | పేజీలు:6 | వెల: రూ.1/-


## దేశ సమగ్రతను కాపాడుకుందాం - తెలంగాణను అభివృద్ధి చేసుకుందాం

**-34 ఏండ్ల కిందటే సద్భావన యాత్ర చేపట్టారు**
**-అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ దార్శనికతకు నిదర్శనం**
**-ఎన్నో పదవులను గాంధీ కుటుంబ త్యాగం చేసింది**
**-గీతారెడ్డికి సద్భావన అవార్డు రావడం సంతోషం**
**-సద్భావన యాత్ర కార్యక్రమంలో సీఎం రేవంత్**
**-పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు**

హైదరాబాద్, అక్టోబర్ 19:దేశ సమగ్రత కోసం 34 ఏళ్ల కిందటే భారత ప్రధానిగా రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర చేపట్టారని, ప్రతీ ఏటా ఆయన స్ఫూర్తిని, సద్భావన యాత్రను కొనసాగిస్తూ ముందుకు వెళుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ చార్మినార్ వద్ద సందర్భంగా మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలం ప్రజలకు సేవలందించిన గీతారెడ్డి సద్భావన అవార్డుకు ఎంపిక చేయడం అభినందనీయమన్నారు.

రాజకీయాల్లో పదవుల కోసం పాకులాడే వారిని చూసామని, కానీ గీతారెడ్డి 2023 ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పిన గొప్ప వ్యక్తి అన్నారు.



రాజీవ్ గాంధీ సద్భావనా యాత్ర స్మారక దినోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ పేదలకు మేలు జరిగేది గాంధీకుటుంబంతో మాత్రమే. గాంధీ కుటుంబం తీసుకున్న నిర్ణయాలతోనే కాంగ్రెస్ హయాంలో దేశంలో పేదలకు మేలు జరిగిందన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారని, ప్రధాని పదవులను సోనియా, రాహుల్ గాంధీ త్యాగం చేశారని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. పదవులను ఇతరులకు ఇచ్చి తమ దార్శకనికతను చూపిన గొప్ప వ్యక్తులని సోనియా, రాహుల్ గాంధీని కొనియాడారు. గాంధీ కుటుంబానికి, దోపిడీ చరిత్ర ఉన్న వారికి పోలికా.., మత సమరస్యాన్ని కాపాడుతూ తెలంగాణను అభివృద్ధి చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

కేసీఆర్ కుటుంబానికి పక్కా దోపిడీ చరిత్ర ఉందన్నారు. నేడు నాలాలు, చెరువులు, ఆక్రమించుకున్న వారే 'హైడ్రా'ను చూసి భయపడుతున్నారని ధ్వజమెత్తారు. ఇదే హైడ్రాను బూచిగా చూపి రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని కుదేలు చేసేందుకు కొంతమంది చూస్తున్నారని ఆరోపించారు. కావాలనే కొంతమంది నేతలు హైదరాబాద్ ప్రతిష్ఠను దెబ్బతిసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇక నుంచి ప్రభుత్వం అలాంటి వారి భరతం పడుతుందని హెచ్చరించారు. అజీజ్‌నగర్‌లో ఇదే హరీశ్‌రావుకు ఫాంహౌస్ లేదా అని ప్రశ్నించారు. 'హైడ్రా' అనగానే కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్ బయటకు వచ్చారని.. పేదలు ఎవరైనా ఫామ్ హౌస్‌లు కట్టుకోగలరా అని రేవంత్ ప్రశ్నించారు.

మూసీ మురికిలో ఉన్న పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని క్లారిటీ ఇచ్చారు. కానీ, ఆ పేదలకు మేలు జరుగుతుంటే ఓరుస్తలేరని ఫైర్ అయ్యారు. ఇప్పటికే బుల్డోజర్లను సిద్ధం చేశా.. ఎవరు అడ్డొస్తారో రండి అంటూ సీఎం సవాల్ విసిరారు. వాళ్ల ఫాంహౌస్‌లపై బోల్డోజర్లు వస్తాయనే భయంతోనే నేడు కేటీఆర్, హరీశ్‌రావు నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. తన ఇంటి ముందుకు వచ్చి చేతులు కట్టుకున్న రోజులను హరీశ్‌రావు మర్చిపోయినట్లున్నారని కౌంటర్ ఇచ్చారు. మూసీ పునరుజ్జీవం వేరు.. 'హైడ్రా' వేరు అని రేవంత్‌రెడ్డి అన్నారు.

ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు . పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆర్థిక మూలాలు దెబ్బతీయాలని చూస్తున్నారు

**-ఆర్థిక మూలల ధ్వంసానికి కుట్రలు**
**-భయం వద్దు.. రియల్ రంగానికి అండగా ఉంటాం**
**-మూసీ బాధిత పేదలకు ఇండ్లు ఇచ్చాం**
**-వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించాం**
**-ఆస్తులు కాపాడుకోవటానికే బీఆర్ఎస్ దొంగ ఏడ్పులు**
**-మూసీ కూల్చివేతల్లో హైడ్రా పాల్గొనలేదు**
**-చెరువులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకే హైడ్రా ఏర్పాటు**
**-హైడ్రా పేరుతో అనవసర రాద్ధాంతం చేస్తున్నారు**
**-బిల్లా, రంగాలు అడ్డుపడితే హైడ్రా అస్సలు ఆగదు**
**-కేటీఆర్ ఫామ్‌హౌస్ విషయంలో అఖిలపక్షం వేస్తాం**
**-నిజనిర్ధారణ కమిటీతో నిజాలేంటో నిగ్గు తేలుద్దాం**
**-సవాళ్ల మీద సవాళ్లు విసిరన సీఎం రేవంత్**
**-సద్భావన యాత్ర స్మారక దినోత్సవంలో విపక్షాలపై నిప్పులు**

హైదరాబాద్, అక్టోబర్ 19:"ఆక్రమణలకు పాల్పడిన బడా బాబులకు హైడ్రా ఓ భూతం, ప్రభుత్వ భూములను, నాలాలు, చెరువులను ఆక్రమించి పెద్ద పెద్ద భవంతులు కట్టినోళ్లపై హైడ్రా ఓ అంకుశం, మదపుటేనుగులను అణచటానికి ఈ హైడ్రా అంకుశంలా పనిచేస్తుంది. కొందరు దీన్ని అడ్డుకోవాలని, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్‌ను దెబ్బ తీయాలని కుట్ర చేస్తున్నారు " అని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. హైదరాబాద్ చార్మినార్ వద్ద శనివారం రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక దినోత్సవ కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు.



### ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని కుట్ర..

రాష్ట్ర ఆర్థిక మూలలను దెబ్బ తీయాలని కొంతమంది కుట్ర చేస్తున్నారని, రియల్ ఎస్టేట్ సంస్థలు భయపడొద్దు.. అండగా ఉంటానని హామీ ఇస్తున్నా అని సీఎం స్పష్టం చేశారు. "మా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. హైడ్రా ఆగదు, అక్రమార్కులకు కంటి మీద కునుకు ఉండదు. హైడ్రా అనగానే హరీశ్, కేటీఆర్ బయటకు వస్తున్నారు. పేదలకు మేలు జరిగితే చూసి ఓర్వలేకపోతున్నారు"అని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీలో మగ్గిపోతున్న పేదలకు ఇండ్లు ఇచ్చి, వ్యాపారాలు చేసుకునేందుకు మహిళలకు ఆర్థిక సాయం అందించాం. మేం జనాన్ని గుండెల్లో పెట్టుకుంటుంటే బీఆర్ఎస్ నేతలు గుండెలు బాదుకుంటున్నారని విమర్శించారు.

### బిల్లా రంగాలు వచ్చినా బుల్డోజర్లు ఆగవు..

ఈ బిల్లా రంగాలు వచ్చి బుల్డోజర్లకు అడ్డు పడతామంటున్నారు. అక్కడికి ఇక్కడికి కాదు.. జన్వాడ ఫామ్ హౌస్‌కు పోదాం పదా, గుల్భాపూర్ నాలాను ఆక్రమించి కేటీఆర్ ఫామ్ హౌస్ కట్టలేదా?, ఈ ఫామ్ హౌస్ కు బుల్డోజర్ వస్తుందనే ఇక్కడ వీళ్లు డ్రామాలు ఆడుతున్నారు,హరీశ్.. నీలాంటి చెప్పులు మోసే వారు కాదు.. ఫామ్ హౌస్‌లో పడుకున్న వాళ్లను రమ్మను నేను వస్తా. అని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. నా ఇంటి ముందుకు వచ్చి చేతులు కట్టుకుని నిలబడ్డ రోజులు మర్చిపోయావా.., ఫామ్ హౌసులు కాపాడుకునేందుకే ఈ బిల్లా రంగాల దొంగ ఏడ్పులు అని నిలదీశారు.

### ఫామ్ హౌస్ తర్వాతే ఎక్కడికైనా..

మూసీ పునరుజ్జీవనం వేరు.. హైడ్రా వేరు. మూసీలో హైడ్రా ఎలాంటి కూల్చివేతలు చేపట్టలేదు. ట్రాఫిక్ సమస్య, నాలాల పునరుద్ధరణ, చెరువుల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడానికే హైడ్రాను తీసుకువచ్చాం, బీఆర్ఎస్ వాళ్ల తాపత్రయం అంతా.. వాళ్ల ఆస్తులు కాపాడుకునేందుకే .. అక్కడికి ఇక్కడికి కాదు? ఎప్పుడైనా ఫామ్ హౌస్ కు రమ్మని సవాల్ చేశారా? అని రేవంత్ ప్రశ్నించారు. వాళ్ల ఫామ్ హౌస్‌ల వద్దకు ఎప్పుడు రావాలో హరీశ్ చెప్పాలి. హరీశ్, కేటీఆర్ ఫామ్ హౌస్ ల విషయంపై అఖిలపక్షం పిలుద్దాం.. నిజ నిర్ధారణ కమిటీతో నిజాలు నిగ్గు తేలుద్దాం.. ఆ తరువాత మూసీ దగ్గరకా.. ఇంకెక్కడికైనానా వెళదాం అని సీఎం రేవంత్ రెడ్డి సవాళ్లపై సవాళ్లు విసిరారు.

## మొక్కజొన్నను కనీస మద్దతును ధరకు కొనుగోలుకు నాఫెడ్ అంగీకారం

హైదరాబాద్ అక్టోబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ఏజెన్సీ );ఈ వానాకాలంలో తెలంగాణ రాష్ట్రంలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం 5,46,865 ఎకరాలు. 9,63,102 మెట్రిక్ టన్నులు (ఓబ) పంట దిగుబడి.. మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మొక్కజొన్న మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 2225/-. కొన్ని చోట్ల మద్దతు ధర కంటే రూ.75 నుంచి రూ.100 తక్కువ ధరకు కొనుగోళ్లు జరుగుతున్నాయి. అందుకే రైతులు నష్టపోకుండా మొక్కజొన్న కొనుగోళ్లు సాఫీగా జరిగేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో ఒక లక్ష మెట్రిక్ టన్నుల (1,00,000 ఓబ) మొక్కజొన్నను కనీస మద్దతును ధరకు కొనుగోలు చేయడానికి నాఫెడ్ అంగీకరించింది. రాష్ట్రవ్యాప్తంగా 100 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు నెలకొల్పి నాఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేయడానికి అన్ని చర్యలు తీసుకుంది. శనివారం నుంచే జగిత్యాల, నిర్మల్ జిల్లాలతో పాటు 12 చోట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో అదనంగా వచ్చిన దిగుబడిని మద్దతు ధరకు కొనడానికి రాష్ట్ర ప్రభుత్వం కూడ సిద్ధంగా ఉన్నట్లు మార్క్ఫెడ్ అధికారులు తెలిపారు.

## ఈనెల 23న జరగాల్సిన కేబినెట్ సమావేశం వాయిదా

ఈనెల 23వతేదీన జరగాల్సిన తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా పడింది. ముందుగా నిర్ణయించిన 23వ తేదీకి బదులుగా 26వ తేదీకి కేబినెట్ సమావేశం కాబోతుంది. కేబినెట్ సమావేశంలో హైడ్రాయ మూసీ నది ప్రక్షాళన, రైతు భరోసా విధి విధానాలు, శీతాకాల అసెంబ్లీ సమావేశాల నిర్వహణ వంటి అంశాలపై కేబినెట్ డిస్కస్ చేయనున్నట్లు తెలిసింది. అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద సంవత్సరానికి ఒక ఎకరానికి రూ. 15వేలు అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. రైతు భరోసా మార్గదర్శకాలు రూపొందించేందుకు ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీ వేసింది. వివిధ వర్గాలతో చర్చలు జరిపిన కేబినెట్ సబ్ కమిటీ.. రైతు భరోసా గైడ్ లైన్స్ ఫైనల్ చేసినట్టు తెలుస్తోంది. దీనిపైనా కేబినెట్ భేటీలో చర్చించే అవకాశముంది.

## బలగాలపై మావోల దాడి..
## ఐఈడీ పేలుడులో ఇద్దరు జవాన్ల వీరమరణం



న్యూఢిల్లీ, అక్టోబర్ 19: ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్ జిల్లాలోని అబుజ్‌మద్‌లోని మొహందిలో నక్సల్స్ మందుపాతరకు పాల్పడ్డారు. ఈ పేలుడులో నలుగురు ఐటీబీపీ జవాన్లు గాయపడ్డారు. ఇందులో ఇద్దరు జవాన్లు వీరమరణం పొందారు. మరో ఇద్దరి పరిస్థితి మెరుగ్గానే ఉందని.. క్షతగాత్రులను ప్రాథమిక చికిత్స నిమిత్తం విమానంలో రాయ్‌పూర్‌కు తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు.

పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. టిబెట్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, డిస్ట్రిక్ట్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ఉమ్మడి పార్టీ నారాయణపూర్ జిల్లాలోని ఓర్చా, మొండి, ఎరత్‌బట్టి ప్రాంతం నుంచి సెర్చ్ ఆపరేషన్ కోసం ధుర్బేరాకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో నక్సల్స్ ఐఈడీతో పేల్చారు.

కోడ్లియర్ గ్రామ సమీపంలోని అడవిలో మందుపాతర పేలగా.. నలుగురు సైనికులు గాయపడ్డారు. ఇందులో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం రాయ్‌పూర్‌కు తరలించగా మృతి చెందినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. మృతులను మహారాష్ట్రలోని సతారాకు చెందిన అమర్ పన్వర్ (36), ఆంధ్రప్రదేశ్‌లోని కడపకు చెందిన కే రాజేశ్ (36)గా గుర్తించారు.

## జీవో నెంబర్ 29ని రద్దు చేయాలని నిరుద్యోగుల ఆందోళన

**-నిరుద్యోగులకు కేంద్రమంత్రి బండి సంజయ్ బిజెపి శ్రేణులు మద్దతు**
**-విద్యార్థులకు, పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట**
**-బండి సంజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్న పోలీసులు**



హైదరాబాద్, అక్టోబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ఏజెన్సీ : గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనతో అశోక్‌నగర్‌లో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. జీవో నెంబర్ 29ని రద్దు చేసి జీవో నెం 55ను అమలు చేయాలంటూ నిరుద్యోగులు శనివారం ఆందోళనలకు పిలుపునిచ్చారు. వీరి నిరసనకు కేంద్రమంత్రి బండి సంజయ్ మద్దతు తెలిపారు. బండి సంజయ్‌తో పాటు బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున అశోక్‌నగర్ చేరుకుని ఆందోళన చేస్తున్న అభ్యర్థులకు మద్దతు తెలుపుతూ నిరసనకు దిగారు. ఈ క్రమంలో ఛలో సెక్రటేరియట్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆందోళన కాస్త తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది.ఎట్టి పరిస్థితుల్లోనూ సెక్రటేరియట్‌కు వెళ్లి తీరతామని బండి సంజయ్ స్పష్టం చేశారు. దీంతో పెద్ద ఎత్తున పోలీసులు అక్కడకు చేరుకుని కేంద్ర మంత్రిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. చివరకు బండి సంజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో విద్యార్థులకు, పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట చోటు చేసుకుంది. అశోక్‌నగర్ నుంచి ఛలో సెక్రటేరియట్‌కు బయలుదేరిన బండి సంజయ్‌ను తెలుగు తల్లి ఫ్లైఓవర్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. అక్కడి నుంచి బీజేపీ కార్యాలయానికి తరలించారు. ఈ ఘటనపై మరికాసేపట్లో బీజేపీ ఆఫీసులో బండి సంజయ్ మీడియాతో మాట్లాడే అవకాశం ఉంది.

గ్రూప్ వన్ అభ్యర్థులకు డీజీపీ హెచ్చరిక..

మరోవైపు ఆందోళన చేస్తున్న గ్రూప్ వన్ అభ్యర్థులను డీజీపీ జితేందర్ హెచ్చరించారు. గ్రూప్ 1 పరీక్షల కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్ల మీదికి వచ్చి సామాన్య ప్రజలను ఇబ్బంది పెడితే ఊరుకోమని స్పష్టం చేశారు. శాంతిభద్రతలను రక్షించాలనే నిన్న (శుక్రవారం) వారి (గ్రూప్ -1 అభ్యర్థులు) ఆందోళనను అరికట్టామని అన్నారు. సమస్య పరిష్కారానికి సుప్రీం కోర్టు కు వెళ్లాలి కానీ రోడ్ల మీద ఆందోళన చేస్తే ఊరుకోమంటూ డీజీపీ జితేందర్ వార్నింగ్ ఇచ్చారు.కాగా.. గ్రూప్ వన్ మెయిన్స్‌కు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈనెల 21 నుంచి 27 వరకు గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు జరుగనున్నాయి. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పరీక్షలు పకడ్బంధీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. మరోవైపు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష తుది కీలో తప్పులు ఉన్నాయని, అందువల్ల ఆ పరీక్షను రద్దు చేసి మెయిన్స్ పరీక్ష నిర్వహించకుండా అడ్డుకోవాలని కోరుతూ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీలు దాఖలైన విషయం తెలిసిందే. ఫైనల్ కీలో తప్పులు ఉండటంతోపాటు వివిధ కారణాలతో ప్రాథమిక పరీక్షను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సింగిల్ జడ్జి ధర్మాసనం కొట్టేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీల్ పిటిషన్లను హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ సమర్థించింది. చివరి నిమిషంలో పరీక్ష రద్దు సాధ్యం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. పరీక్షలు వాయిదా వేయాలని ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. దీంతో గ్రూప్ 1 పరీక్షలకు అడ్డంకులు తొలిపోయినట్లైంది.

## జీవో 29 రద్దు చేశాకే గ్రూప్-1 మెయిన్స్ నిర్వహించాలి.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్..

హైదరాబాద్, అక్టోబర్ 19:గ్రూప్-1 అభ్యర్థుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుంది.. జీవో 29 రద్దు చేశాకే గ్రూప్-1 మెయిన్స్ నిర్వహించాలని ఆ పార్టీ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళనలకు మద్దతుగా నిలిచిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దాసోజ్ శ్రవణ్, శ్రీనివాస్ గౌడ్‌ను సచివాలయం వద్ద పోలీసులు అరెస్టు చేశారు.

ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా జీవో 29 రద్దు చేయకుండా.. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలనుకోవడం అప్రజాస్వామికం. రాజ్యాంగ వ్యతిరేకం. అర్జెంట్‌గా జీవో 29ని రద్దు చేసి.. నాడు కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 55ని పునరుద్ధరించి పరీక్షలు నిర్వహించాలి. అప్పటిదాకా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలి. నిరుద్యోగులకు మద్దతిస్తున్నాం. కేటీఆర్ వద్దకు వచ్చి గ్రూప్-1 అభ్యర్థులు తమ బాధలను విన్నవించుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి సమస్యను పరిష్కరించడం చేతగాక.. గ్రూప్-1 అభ్యర్థుల వెనుకాల రాజకీయ నాయకులు ఉన్నారని చెప్పడం సరికాదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి.. జీవో 29 రద్దు చేసి.. పరీక్షలు నిర్వహించాలి. అన్ని వర్గాలకు, కులాలకు సమన్యాయం జరిగేలా చూడాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.

## వనదుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

**-పూల బొకేలతో ఘన స్వాగతం పలికిన జిల్లా జడ్జి, ఎస్పీ, సీనియర్ సివిల్ జడ్జి, అదనపు కలెక్టర్**
**-పూజల అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించిన ఈవో**
**-హరిత హోటల్లో పోలీసు గౌరవ వందనం స్వీకరించిన హైకోర్టు జడ్జి**

మెదక్, అక్టోబర్ 18: దేశంలోనే రెండో వనదుర్గామాత ఆలయంగా ప్రసిద్ధికెక్కిన జనమేజయ సర్పయాగ స్థలిగా ప్రసిద్ధికెక్కిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గామాతను హైకోర్టు జడ్జి జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఏడుపాయల ఆలయ ప్రాంగణానికి చేరుకోగానే మెదక్ జిల్లా జడ్జి లక్ష్మీ శారద, సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, ఎస్పీ ఉదయ్ కుమార్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పూల బొకేలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం హరిత హోటల్లో పోలీసు గౌరవ వందనం స్వీకరించారు.

ఆ తరువాత ఆలయానికి చేరుకోగా ఆలయ అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్, ఆలయ అర్చకులు శంకర శర్మ, పార్థివ శర్మలు వారిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో మెదక్ జూనియర్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రీటా లాల్ చంద్, నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జ్ అనిత, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుభాష్ గౌడ్, జనరల్



## ఆరోగ్యమే మహాభాగ్యం.. పార్కులను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే కృష్ణారావు

హైదరాబాద్, అక్టోబర్ 19: ఆరోగ్యమే మహాభాగ్యమని, మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా నగరంలో మొదటిసారిగా కూకట్‌పల్లిలో ప్రత్యేక పార్కులను అందుబాటులోకి తీసుకొచ్చామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు.

కూకట్‌పల్లి రంగధాముని ( ఐడీఎల్) చెరువు గట్టుపై నేటి స్త్రీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 3కే రన్ వాక్‌థాన్‌ను ఎమ్మెల్యే జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో మహిళల కోసం ప్రత్యేక పార్కులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు.

ఈ పార్కులను మహిళలు, చిన్నారులు సద్వినియోగం చేసుకుంటున్నారని వెల్లడించారు. మహిళలకు అన్ని రంగాలలో రాణించే సత్తా ఉంటుందని, అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. అందుబాటులో ఉన్న పార్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని, నిత్యం వ్యాయామం, యోగా సాధన, నడకకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు 3కే రన్ వాక్‌థాన్‌ను నిర్వహించిన సంస్థ సభ్యులను అభినందించారు.




# ఆపన్నులకు ఆత్మీయ భరోసా.. విశాఖలో లోకేష్ ప్రజాదర్బార్

## -విశాఖలో మంత్రి నారా లోకేష్ ప్రజాదర్బార్
## -ప్రతీ ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి అర్జీలు స్వీకరణ



విశాఖపట్నం, అక్టోబర్ 19: విశాఖలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రెండో రోజు పర్యటనలో భాగంగా శనివారం ఉదయం జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రజలు తరలివచ్చారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై స్వయంగా మంత్రిని కలిసి విన్నవించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించిన మంత్రి నారా లోకేష్.. వారి నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు.

ఎలాంటి ఆధారం లేని తమకు టిడ్కో ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని విజయనగరం జిల్లా బొద్దూరుకు చెందిన వావిలపల్లి హేమలత కోరారు. ఏపీ టూరిజం కార్పొరేషన్‌లో తనకు ఉద్యోగం కల్పించాలని బొద్దూరుకు చెందిన వావిలపల్లి వేణుగోపాలరావు విజ్ఞప్తి చేశారు. 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని డీఎస్సీ 1998 టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ బోర్డు ఏర్పాటుచేసి నాయి బ్రాహ్మణులను ఆదుకోవాలని విశాఖకు చెందిన దేవగుప్త రమేష్ కోరారు. మీ-సేవ సీఎస్ సీ సెంటర్ లాగిన్ ఐడీని పునరుద్ధరించాలని గొల్లలపాలెంకు చెందిన కే.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూమి విక్రయించి తమను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని విశాఖకు చెందిన ఆర్.లక్ష్మి కోరారు. దివ్యాంగురాలైన తన కుమార్తెకు గత ప్రభుత్వం పెన్షన్ నిలిపివేసిందని, తిరిగి పునరుద్ధరించాలని విశాఖకు చెందిన పుక్కళ్ల అప్పలరాజు విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# ప్రభుత్వంపై రైతుల యుద్ధం తప్పదు : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 19:కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతుల యుద్ధం తప్పదని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ఖరీఫ్‌కి రైతు భరోసా లేదన్న మంత్రి తుమ్మల వ్యాఖ్యలపై మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా ఇచ్చి తీరాల్సిందేనన్నారు. తుమ్మల ప్రకటనతో రైతులకు ప్రభుత్వంపై నమ్మకం పోయిందని.. రైతులను మోసం చేశారని స్పష్టంగా తేలిపోయిందన్నారు. రైతులను కేసీఆర్ నుంచి దూరం చేసి ఇప్పుడు వాళ్లని రోడ్డున పడేస్తున్నారన్నారు. ఇన్ని రోజులు కుంటి సాకులు చెప్పి ఇప్పుడు చావు కబురు చెప్పి తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. వాయిదాలు, ఓట్లు అయిపోయి వోసాలే మిగిలాయన్నారు. వరంగల్ డిక్లరేషన్ ప్రకారం రైతులకు కాంగ్రెస్ బాకీ పడిందని.. రైతుల ఆందోళనలకు బీఆర్ఎస్ మద్దతిస్తుందన్నారు. గల్లా పట్టి రైతులు వారి బాకీ వసూలు చేసుకోవడం ఖాయమన్నారు. మేనిఫెస్టోలో పెట్టి అధికారంలోకి వచ్చి మోసం చేస్తారా ..? రైతుల తిరుగుబాటుకు ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు.

# విజయవాడలో వరద బాధితులకు నగదు, దుప్పట్లు చీరలు బియ్యం సహాయం

విజయవాడ అక్టోబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ఏజెన్సీ );ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం, గ్లోబల్ విశ్వకర్మ ఎన్నారై అసోసియేషన్ (అమెరికా) మరియు గౌరవ దాత జవ్వాది కూర్మాచార్యులు సంయుక్తంగా విజయవాడ చిట్టినగర్ పుల్లేటికుర్తి వారి కళ్యాణ మండపంలో శనివారం సాయంత్రం నిర్వహించిన సేవా కార్యక్రమంలో ఇటీవలి వరదలో తీవ్రంగా నష్టపోయిన 200 మంది బాధితులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల నగదు, దుప్పటి మరియు చీర, 1400 రూపాయల విలువైన పది కేజీల బియ్యం నిత్యవసరాలు పంపిణీ చేశారు.




ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం వారు నగదు, గ్లోబల్ విశ్వకర్మ ఎన్నారై అసోసియేషన్ వారు బియ్యం నిత్యవసరాలు, జవ్వాది కూర్మాచార్యులు దుప్పటి చీర పంచారు. గ్లోబల్ విశ్వకర్మ ఎన్ఆర్ఐ అసోసియేషన్ వారు ఈ కార్యక్రమాన్ని విశ్వకర్మ ఆంధ్ర తెలంగాణ సేవా సంస్థల సమాఖ్య (వత్స) సభ్య సంస్థలైన వెస్సో ట్రస్ట్, విశ్వంలో విలీనం సేవా ట్రస్ట్, విశ్వకర్మ ఫౌండేషన్ అండ్ సేవా ట్రస్ట్, శ్రీనివాసా నిలయం చారిటీస్, విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం, కారుణ్య హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ల మద్దతుతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పావులూరి హనుమంతరావు, గౌరవ అధ్యక్షులు జవ్వాది కూర్మాచార్యులు, విశ్వంలో విలీనం వ్యవస్థాపక అధ్యక్షులు పెంటా శ్రీనివాస చారి, వెస్సో ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ బంగారు శ్రీనివాస్, కోశాధికారి టేకి వరప్రసాద్, విశ్వకర్మ ఫౌండేషన్ అండ్ సేవా ట్రస్ట్ కమిటీ సభ్యులు వింజరపు గోవిందరావు, శ్రీనివాస నిలయం చారిటీస్ అధ్యక్షులు కటకం శ్రీనివాసాచారి, ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం ప్రధాన సంచాలకులు అప్పలభక్తుల శివకేశవరావు (శివశ్రీ), కారుణ్య హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ అధ్యక్షులు గడ్డం విజయరాజు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఉజ్వల భవిష్యత్తుపై తోడ్పాటునందిస్తా

## -ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి. నరేందర్ రెడ్డి

కరీంనగర్,అక్టోబర్ 19: (నేటినిజం ప్రతినిధి) ట్టభద్రులకు అన్ని రంగాలలో ప్రాధాన్యం వచ్చే విధంగా ప్రణాళికలను రూపొందించి అమలు చేయడానికి కృషి చేయడంతో పాటు వారికి ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ఉంటానని ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్లో పలు పాఠశాలలను కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి పలు ఆత్మీయ సమ్మేళనాలలో పాల్గొని మాట్లాడి రానున్నటువంటి పట్టభద్రుల శాసనసభ శాసనమండలి ఎన్నికలలో ప్రతి ఒక్క అర్హత కలిగిన పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకొని సామాజిక వాతావరణాన్ని నెలకొల్పి అభివృద్ధికి అండగా నిలవాలని అన్నారు. ఉత్తమంగా వ్యవహరించి సమాజానికి తోడ్పాటు అందించే విధంగా ఎదగాలని కోరారు. ప్రస్తుత సమాజంలో పట్టభద్రులకు ఉద్యోగాల కల్పన విషయంలో ఆలస్యం జరిగిన వారికి అన్ని రకాలుగా చేయూతనిస్తానని వారికి ఉద్యోగాలను కల్పిస్తామని చెప్పారు.

ప్రవేట్ యాజమాన్యాలతో మాట్లాడి పనిచేసే ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను జారీ చేయడానికి కృషి చేస్తానని చెప్పారు.

విద్యారంగంలో నూతన ఉరవడిని తీసుకొచ్చే అవసరం ఎంతగానో ఉందని చెప్పారు. విద్యను వ్యాపారం చేయకుండా సమాజ అభివృద్ధికై వ్యాప్తి చేయాలని కోరారు.



వచ్చే జూన్ మాసంలో ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్ మరియు మెదక్ నియోజకవర్గాలలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అల్ఫోర్స్ విద్యాసంస్థల వారి తరఫున ఉచిత కోచింగ్ శిక్షణ కేంద్రాలను ప్రారంభిస్తానని చెప్పారు.

అదేవిధంగా పోటీ పరీక్షల ఆశావాహుల సౌకర్యార్థమై ఈ దీపావళి పర్వదినాన ప్రత్యేక ఆప్ ను ప్రవేశ పెట్టడం జరుగుతుందని, ఆశావాహులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడమే కాకుండా ఉద్యోగ సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలని వారు సూచించారు.

ఉత్తర తెలంగాణను అన్ని రంగాలను అగ్రగామిగా నిలిపి హైదరాబాద్కు దీటుగా అభివృద్ధి పరిచి ఆర్థిక వనరులను పెంపొందించడంలో కీలకంగా ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమాలలో పలు విద్యాసంస్థల యజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సనాతన హిందూ ధర్మాన్ని రక్షించాలి

## -వీహెచ్పి నాయకుల డిమాండ్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 19: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ



రాష్ట్రంలో గత 15 రోజుల నుంచి హిందూ దేవి- దేవతల ఆలయాలపై, పండగలపై తీవ్రవాదులు దాడులు చేయడం వల్ల హిందూ మనోభావాలు దెబ్బతింటున్నాయని, కావున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మతోన్మాదులపై చట్టరీత్యా చర్యలు తీసుకుని హిందువుల ఆలయాలను ,సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలని డిప్యూటీ తాసిల్దార్ కు విశ్వ హిందూ పరిషత్ వేములవాడ తరపు న వినతిపత్రం అందజేశారు. ఇట్టి కార్యక్రమంలోగడప కిషోర్ రావు, నాగుల రాములు గౌడ్ గౌరీశెట్టి శ్రీనివాస్,హరీష్, కొమురవెల్లి వికాస్,ఆడేపు శ్రీనివాస్, రాజేందర్ఆందస్ శ్రీనివాస్,నాంపల్లి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# బలగం ఫేమ్ కొమురమ్మకు స్పీకర్ ఆర్థిక సాయం..

హైదరాబాద్, అక్టోబర్ 19:బలగం మూవీ ఫేమ్ కొమురమ్మ, మొగిలయ్యలకు తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య స్మారక అవార్డు సభలో గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్న విషయం తెలిసిందే. ఆ సమయంలో బలగం ఫేమ్ కొమురమ్మ మొగిలయ్య ఆర్థిక పరిస్థితి చూసి చలించిపోయి? తన నెల జీతం నుంచి రూ.లక్ష ఇస్తానని హామీ ఇచ్చాడు.

దీంతో ఇచ్చిన మాట ప్రకారం? నేడు మినిస్టర్ క్వార్టర్స్ లోని తన అధికార నివాసంలో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ కొమురమ్మ, మొగిలయ్యలకు రూ.లక్ష చెక్కును అందజేశారు. తమకు ఆర్థిక సాయం అందించిన స్పీకర్ ప్రసాద్ కుమార్ కు కొమురమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

# నిరుద్యోగ ర్యాలీలో విధ్వంసం చేసేందుకు బీఆర్ఎస్ కుట్ర

## -కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖలు

హైదరాబాద్ అక్టోబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ఏజెన్సీ );తెలంగాణలో రిజర్వేషన్లను రద్దు చేసే కుట్ర జరుగుతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేసారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశానం లో మాట్లాడుతూ జీవో నెంబర్ 29 ఓ సంకేత మన్నారు.సోనియా జన్మదినం...నిరుద్యోగుల బలిదినం కాబోతోంది ప్రభుత్వం ఇప్పటికైనా దిగి వచ్చి గ్రూప్ 1 పరీక్షలను రీ షెడ్యూల్ చేయాల్సిందేనన్నారు.నన్ను అరెస్ట్ చేసే దమ్ముందా?నిరుద్యోగ ర్యాలీలో విధ్వంసం చేసేందుకు బీఆర్ఎస్ కుట్రకేటీఆర్ ఓ యూజ్ లెస్ ఫెలో....నేను పేపర్ లీకేజీ చేసినట్లు ఫ్యామిలీతో కలిసి ప్రమాణం చేసే దమ్ముందా?డ్రగ్స్ తీసుకుని చీకటి దందాలు సాగించిన బతుకు నీదినా జోలికొస్తే... నీ చీకటి బతుకులను బయటపెడతా...నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు బిడ్డా....కాంగ్రెస్ తో కుమ్మక్కు రాజకీయాలు చేస్తోంది మీరు కాదా?ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్, కాళేశ్వరం కేసులు రాకుండా చీకటి రాజకీయాలు చేస్తోంది మీరే కదా అన్నారు.కాంగ్రెస్ తో పగలు ఫైటింగ్... రాత్రిళ్లు లవ్వింగ్ బతుకు మీది,తెలంగాణలో బీఆర్ఎస్ పనైపోయిందన్నారు.జేసీబీ పెట్టి లేపినా బీఆర్ఎస్ లేచే పరిస్థితి లేదన్నారు.2028లో తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే నన్నారు.సికింద్రాబాద్ లో భజరంగ్ దళ్ కార్యకర్తలు, ప్రజలపై పోలీసుల లాఠీఛార్జ్ ను ఖండిస్తున్నాప్రశాంతంగా జరుగుతున్న ప్రదర్శనను అడ్డుకుని హింసను సృష్టించడం దారుణంపోలీసుల తీరు దుర్మార్గమని విమర్శించారు.అరెస్ట్ చేసిన బీజేపీ కార్యకర్తలను, నిరుద్యోగులను బేషరతుగా వదిలేయండి మళ్లీ అశోక్ నగర్ వెళ్లే అవకాశం నాకివ్వకండి బండి సంజయ్ హెచ్చరించారు




# భారతదేశంలో పరిశోధన, ఆవిష్కరణల కోసం పరిశ్రమ-విద్యా భాగస్వామ్యాన్ని వేగవంతం చేయడంపై చర్చించిన పీఎం-ఎస్టీఐఏసీ 26వ సమావేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 19: న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్ నేతృత్వంలో ప్రధానమంత్రి సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ అడ్వైజరీ కౌన్సిల్ (పీఎం-ఎస్టీఐఏసీ) 26వ సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో పీఎం-ఎస్టీఐఏసీ సభ్యులతో పాటు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, విద్యా సంస్థలు, పారిశ్రామిక సంస్థల అధికారులు హాజరయ్యారు. పరిశోధన, ఆవిష్కరణల్లో ప్రస్తుత స్థితిగతులు, ఆమోదయోగ్యమైన భాగస్వామ్య విధానాలు, వాటి స్థానికంగా సందర్భోచిత పద్ధతులు, సమర్థవంతమైన విధానాల అమలుపై చర్చించారు.

ఈ సమావేశంలో... నీతి ఆయోగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ సభ్యులు- డాక్టర్ వీకే సారస్వత్, భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయ శాస్త్రీయ కార్యదర్శి- డాక్టర్ పర్వీందర్ మైనీ, బయో టెక్నాలజీ విభాగ కార్యదర్శి- డాక్టర్ రాజేష్ ఎస్ గోఖలే పాల్గొన్నారు. వీరితో పాటు పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి- లీనా నందన్, అంతరిక్ష శాఖ కార్యదర్శి, ఆరోగ్య పరిశోధన విభాగం కార్యదర్శి- డాక్టర్ ఎస్.సోమనాథ్, వైద్య పరిశోధన శాఖ కార్యదర్శి, ఐసీఎంఆర్- డీజీ డాక్టర్ రాజీవ్ బల్, సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ, సీఎస్ఐఆర్, డీజీ- డాక్టర్ ఎన్. కలైసెల్వి, రక్షణ పరిశోధన, అభివృద్ధి శాఖ కార్యదర్శి- డాక్టర్ సమీర్ వి కామత్, డీఆర్డీవో చైర్మన్- అజిత్ కుమార్ మొహంతి, అణుశక్తి శాఖ కార్యదర్శి, ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి- ఎస్ కృష్ణన్, శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి- ప్రొఫెసర్ అభయ్ కరాండికర్, ఇన్-స్పేస్ చైర్మన్- డాక్టర్ పవన్ గోయెంకా పాల్గొన్నారు.

దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల నుంచి కూడా అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఐఐఎస్సీ బెంగళూరు డైరెక్టర్- ప్రొఫెసర్ గోవిందన్ రంగరాజన్, ఐఐటీ బాంబే డైరెక్టర్- ప్రొఫెసర్ శిరీష్ కేదార్, బిట్స్ పిలానీ ప్రాంగణాల ఉప సంచాలకులు- ప్రొఫెసర్ వి.రాంగోపాల్ రావు, ఐఐటి గాంధీనగర్ డైరెక్టర్- ప్రొఫెసర్ రజత్ మూనా హాజరయ్యారు.

పారిశ్రామిక సంస్థల నుంచి, నాస్కామ్ అధ్యక్షురాలు- శ్రీమతి దేబ్జానీ ఘోష్, అధ్యక్షుడు- శ్రీ రాజేష్ నంబియార్, బయోకాన్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్, ఫౌండర్- శ్రీమతి కిరణ్ మజుందార్ షా, ఇన్వెస్ట్ ఇండియా సంస్థ సీఈఓ, ఎండీ- శ్రీమతి నివృతి రాయ్, ఫిక్కీ ఇన్నోవేషన్ కమిటీ కో చైర్- శ్రీమతి ఆనంది అయ్యర్, ఫౌండేషన్ ఫర్ అడ్వాన్సింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వ్యవస్థాపకుడు- శ్రీ ఆశిష్ ధావన్, సెంటర్ ఫర్ టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఎకనామిక్ రీసెర్చ్ సీఈఓ- శ్రీ జనక్ నబర్ పాల్గొని వారి ఆలోచనలు పంచుకున్నారు.

సీఎస్ఐఆర్, మాజీ డైరెక్టర్ జనరల్- డాక్టర్ రఘునాథ్ అనంత్ మషేల్కర్, సీఐఐ మాజీ- చైర్మన్ డాక్టర్ నౌషాద్ ఫోర్బ్స్ వారి అభిప్రాయాలను సమావేశంలో తెలిపారు.

ప్రొఫెసర్ సూద్ మాట్లాడుతూ- పరిశోధన, ఆవిష్కరణల్లో, ముఖ్యంగా అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్) ద్వారా పరిశ్రమ-విద్యా రంగ భాగసామ్యాన్ని బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ లక్ష్యసాధనలో భాగంగా- పరిశోధన, ఆవిష్కరణ కార్యకలాపాల ఫలితంగా వచ్చే సామాజిక-ఆర్థిక ప్రయోజనాలను పొందేందుకు పరిశ్రమలు, విద్యా సంస్థలు, ప్రభుత్వం సంపూర్ణ పాత్ర పోషించాలని కోరారు.

నీతి ఆయోగ్, సైన్స్, టెక్నాలజీ సభ్యులు- డాక్టర్ వి.కె.సారస్వత్ మాట్లాడుతూ దేశంలో పరిశోధనలు, ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి పరిశ్రమలు, విద్యా రంగం సహకరించగల ప్రాధాన్యతా రంగాలను గుర్తించాలని పిలుపునిచ్చారు. భారతదేశాన్ని ఉత్పత్తి ఆధారిత దేశంగా మార్చే రూపకల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని... విద్యా రంగ పరిశోధనలను ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యాన్ని పెంపొందించడం, విద్యా- పరిశ్రమ రంగాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, స్వదేశీ పరిశోధనాభివృద్ధిపై నమ్మకాన్ని పెంపొందించేలా కృషి చేయాలని అన్నారు. దేశంలో పరిశోధనాభివృద్ధి వాతావరణాన్ని కల్పించేందుకు, ప్రధానంగా విద్యారంగం- పరిశ్రమ మధ్య అనుసంధానతను పెంచాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో పరిశోధన, ఆవిష్కరణల కోసం పరిశ్రమ-వి ద్యారంగ భాగస్వామ్యాల ట్రిపుల్ హెలిక్స్ నమూనాపై నిపుణులు వివరణాత్మక ప్రదర్శనను ఇచ్చారు. ఐసీటీ, లైఫ్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్స్, అంతరిక్షం, ఎలక్ట్రానిక్స్ వంటి వివిధ రంగాల్లో విద్యా-పరిశ్రమల భాగస్వామ్యం కోసం, ఆయా రంగాలను ప్రోత్సహించడానికి వివిధ నమూనాలు, ఎదురయ్యే సవాళ్లు, సంబంధిత సిఫార్సులపై చర్చలు జరిగాయి. పరిశ్రమ-విద్యా భాగస్వామ్యం ద్వారా దేశ వృద్ధిలో గణనీయమైన ప్రభావాలను చూపగల కొన్ని కీలక ప్రాధాన్య రంగాలపై వారు దృష్టి సారించారు. ప్రభావవంతమైన, మెరుగైన ఫలితాలను అందించడానికి ప్రభుత్వం, పరిశ్రమ, విద్యా సంస్థల మధ్య ఏర్పాటు చేసుకున్న లక్ష్యాల ప్రాముఖ్యతను కూడా చర్చించారు.

ప్రజెంటేషన్ల అనంతరం, ప్రత్యేక ఆహ్వానితులు, పీఎం-ఎస్టీఐఏసీ సభ్యులను వేదికపైకి ఆహ్వానించారు. పరిశ్రమ-విద్యారంగ భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై ట్రిపుల్ హెలిక్స్ విధానాన్ని విస్తరించడంలో అంకుర సంస్థలు, యాక్సిలరేటర్లు, వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ పాత్రపై వారు సమాలోచనలు చేశారు. ఇందులో ప్రభుత్వ పాత్రపై వారు చర్చించారు. ప్రభుత్వం వినియోగదారుగా, సదుపాయ సంధాతగా ఉంటూ, మల్టీడిసిప్లినరీ విధానాలతో విద్యా పరిశోధన, పరిశ్రమల మధ్య అనుసంధానతను పెంచాలని సూచించారు. పరిశోధన సంస్థలతో సహా విద్యారంగం- పరిశ్రమల మధ్య ఎలాంటి అంతరాయం లేని విధివిధానాలను వారు సూచించారు. ప్రాథమిక పరిశోధన, అత్యాధునిక సాంకేతికత రెండింటిలోనూ దీర్ఘకాలిక ప్రభుత్వ పెట్టుబడుల ప్రాముఖ్యతను కూడా వారు ప్రధానంగా ప్రస్తావించారు.

ప్రొఫెసర్ సూద్ తన ముగింపు ప్రసంగంలో మాట్లాడుతూ, పరిశోధనాభివృద్ధి సామర్థ్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు భాగస్వాముల మధ్య ప్రోత్సాహకాలను సమీకరించాల్సిన ప్రాముఖ్యతను వివరించారు. ప్రస్తుత వనరులు, భవిష్యత్ అవసరాల మధ్య ఉండే అంతరాన్ని పూడ్చాల్సిన అవసరం ఉందన్నారు. పరిశోధన, ఆవిష్కరణలు దేశ కీలక అవసరాలను తీర్చేలా చూడాలని సమావేశంలో వక్తలు చేసిన సిఫార్సులను ఆయన మరోసారి ప్రస్తావించారు.

# 'ఇఎస్ఇ-2025'కు అక్టోబరు 22 నవంబరు వరకూ తాజాగా దరఖాస్తుల స్వీకరణకు 'యుపిఎస్‌సి' నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 19: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) 'ఇంజినీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్' (ఇఎస్ఇ-2025)ను వాయిదా వేసింది. 'ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్' (ఐఆర్ఎంఎస్)ను 'ఇఎస్ఇ'లో విలీనం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం దృష్ట్యా ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా 'ఇఎస్ఇ-2025' పరీక్షకు అభ్యర్థులు 2024 అక్టోబరు 18 నుంచి నవంబరు 22 వరకూ తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపింది. అయితే, ఇప్పటికే (సెప్టెంబరు 18 నుంచి అక్టోబరు 8 వరకూ) దరఖాస్తు చేసినవారు మళ్లీ దాఖలు చేయాల్సిన అవసరం ఉండదని పేర్కొంది. ఈ సవరణకు అనుగుణంగా దరఖాస్తులలో మార్పుచేర్పులకు కమిషన్ 7 రోజుల గడువిచ్చింది. దీని ప్రకారం వారు 2024 నవంబరు 23 నుంచి 29 వరకూ వివరాల దిద్దుబాటు/సవరణ చేసుకోవచ్చు. అంతేకాకుండా అవసరమైతే తాజా దరఖాస్తులకు ఇచ్చిన గడువులోగా కూడా వివరాలను నవీకరించుకోవచ్చు.

ఈ నేపథ్యంలో 'ఇఎస్ఇ-2025'కు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షకు సిద్ధం కావడం కోసం మరింత సమయమిస్తూ 'ప్రిలిమినరీ' పరీక్షను 2025 జూన్ 8వ తేదీకి, 'మెయిన్' పరీక్షను 2025 ఆగస్టు 10వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కమిషన్ ప్రకటించింది.

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వార్షిక పరీక్షల నిర్వహణ కార్యక్రమం-2025 ప్రకారం 'ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2025' కోసం 2024 సెప్టెంబరు 18న నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తుల దాఖలుకు ఆ రోజు నుంచి 2024 అక్టోబరు 8 దాకా గడువిచ్చింది. అయితే, 'ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్' (ఐఆర్ఎంఎస్) కింద (ట్రాఫిక్, అకౌంట్స్, పర్సనల్ సబ్-కేడర్) నియామకాలను కూడా 'ఇఎస్ఇ' (సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్, స్టోర్స్ సబ్-కేడర్)ద్వారానే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా రైల్వే మంత్రిత్వ శాఖ 2024 అక్టోబరు 9న 'ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్ (సవరణ) నిబంధనలు-2024'ను జారీ చేసింది.

ఈ సవరణను అనుసరించి 'ఇఎస్ఇ-2025' పరీక్ష నిబంధనలు, నోటీసుపై కమిషన్ 2024 అక్టోబరు 18న అనుబంధ సవరణను జారీ చేసింది. 'ఇఎస్ఇ'కి తాజాగా దరఖాస్తు చేసే అభ్యర్థులు ముందుగా వీటిని పరిశీలించాలని సూచించింది.

# కాంగ్రెస్ - బీజేపీ మధ్య ఉన్న చీకటి ఒప్పందం మరోసారి బట్టబయలైంది : హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 19: గ్రూప్స్ అభ్యర్థులు చేస్తున్న నిరసనకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ముఠా గోపాల్, దాసోజు శ్రవణ్ సహా ఇతర నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ – బీజేపీకి మధ్య ఉన్న చీకటి ఒప్పందం మరోసారి బట్టబయలైంది. బీజేపీకి ఒక న్యాయం. బీఆర్ఎస్‌కు ఒక న్యాయమా.. అని హరీశ్‌రావు ప్రశ్నించారు. గంటల పాటు కేంద్ర మంత్రి బండి సంజయ్ వచ్చి నిరసన తెలియజేస్తుంటే అడ్డుకోని కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ నాయకులను మాత్రం అరెస్టు చేయడం దుర్మార్గం. వారి పట్ల



పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం. రాజకీయాలు పక్కనబెట్టి ముందు విద్యార్థుల సమస్య పరిష్కరించడంపై దృష్టి పెట్టండి. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆపండని కాంగ్రెస్ ప్రభుత్వానికి హరీశ్‌రావు సూచించారు.

